విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 22, అక్టోబర్ 2023

దీక్షకు తరలిన ఎస్‌టియు నాయకులు

విశాలాంధ్ర–చాగలమర్రి: దీర్ఘకాలిక ఆర్థిక

బకాయిల చెల్లింపుకు ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం చేపట్టిన ఆక్రందన దీక్షకు శనివారం తరలివెళ్ళారు. ప్రభుత్వం కొన్నేళ్లుగా పెండింగ్‌లోని ఆర్థిక బకాయిలు చెల్లించాలంటూ చేపట్టిన ఆక్రందన దీక్షకు మండలశాఖ ఎస్టీయూ అధ్యక్షుడు మస్తాన్‌భాష ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి తరలి వెళ్ళారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లోని ఆర్థిక బకాయి చెల్లించాలని డిమాండ్ చేశారు.

మొండిబకాయిలకు ఉద్యమాలే సరైన మందు

విశాలాంధ్ర – నంద్యాల : ఉద్యోగుల దీర్ఘ కాలిక బకాయిలకై ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ ఎస్టీయూ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు నంద్యాల జిల్లా కేంద్రం బొమ్మలసత్రం సర్కిల్ నందు శనివారం బకాయిల కొరకు ఆక్రందన దీక్షలను నిర్వహించారు. దీక్షలను జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు అజాంబేగ్, మౌలాలి, రాష్ట్ర సహాధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఇక్బాల్ భాషతో పాటు పాల్గొన్న ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు గత నాలుగేళ్లుగా ప్రభుత్వం నుండి రావాల్సిన కరువు భత్యం బకాయిలు,

11వ పీఆర్సీ బకాయిలు, ఎపిజిఎల్ఐ, జిపిఎఫ్ బకాయిలు, ఆర్జిత సెలవుల బకాయిలు, ఉద్యోగుల పదవీ విరమణ చివరి ప్రయోజనాలు, సీపీఎస్ ఉద్యోగులకు వారి ప్రాన్‌ఖాతాలోజమ చేయాల్సిన బకాయిలు మొత్తం కలిపి 85,350 కోట్లు చెల్లించకుండా ఎన్ని సమావేశాలు పెట్టి ప్రాతినిధ్యం చేసిన ప్రభుత్వం ఎందుకు మొండిగా వ్యవహరిస్తుందో ఎవ్వరు సమాధానం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు ఉద్యోగులకు ఆర్థికపరంగా ఈ ప్రభుత్వం అణదొక్కడం తప్ప చేసిన ఉపకారం ఏందో ఈప్రభుత్వ పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఎవరికి ఆమోదం కానీ అసలు గ్యారంటీ లేని జిపిఎస్‌ను ఏకపక్షంగా ఆమోదించడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించడం కాదా? దీనిని ఎలా ఉద్యమాలతో ఎదుర్కోవాలో ఉద్యోగ సంఘాలకు అపార అనుభవం ఉందన్నారు. నాయకులు రామ చంద్రారెడ్డి, వెంకట్రామిరెడ్డి, శివశంకర్, ప్రసాద్, రమణ, వెంకటనాయక్, నరసింహారావు రఫీ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగం చిరస్మరణీయం

విశాలాంధ్ర–ఉయ్యాలవాడ: శాంతి భద్రతల పరిరక్షణలో వీరమరణం పొందిన అమరుల త్యాగం చిరస్మరణీయమని ఆళ్లగడ్డరూరల్ సీఐ హనుమంత్ నాయక్ అన్నారు. శనివారం పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అల్లూరులో విధినిర్వాణంలో అమరుడైన ఆరికట్ల రాంభూపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి సీఐ, ఎస్ఐ సత్యనారాయణ, మాజీ గ్రామ సర్పంచ్ ఆరికట్ల శివరామ కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కూలూరు రామ కృష్ణారెడ్డి, న్యాయవాది మల్లికార్జున్ రెడ్డి, వైసీపీ నాయకులు ఆరికట్ల శివారెడ్డిలు నివాళులర్పించారు.

లారీఓనర్స్ అసోసియేషన్స్ ప్రారంభం

విశాలాంధ్ర –ఆత్మకూరు టౌన్: పట్టణంలోని ఎం.డబ్ల్యూ. ఫంక్షన్ హాల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన లారీ ఓనర్స్ అసోసియేషన్స్ కార్యాలయాన్ని ఎథిక్స్‌కమిటీ చైర్మన్, నియోజక వర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ అధ్యక్షులు సయ్యద్‌మీర్, కౌన్సిలర్లు గౌసులాజం, 6వ వార్డు ఇన్‌చార్జ్ ఆమద్‌రసూల్, లారీ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

విశాలాంధ్ర– ఉయ్యాలవాడ: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని జడ్‌పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి అన్నారు. శనివారం మండల పరిధిలోని తుడుమలదిన్నె గ్రామ సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో ఆర్థోపెడిక్ వైద్యులు కిరణ్ కుమార్, జనరల్ సర్జన్ ఎండి శ్రీకాంత్ రెడ్డి, వైద్యాధికారులు శివలింగమ్మ, వెంకటసుబ్బయ్య, కంటి వైద్యనిపుణులు రమేష్‌లు 461 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పేరేడ్డి సుబ్బారెడ్డి, గ్రామ వైసిపి నాయకులు సింగిరెడ్డి దస్తగిరిరెడ్డి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వైద్య బృందం పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఎమ్మెల్యే కాటసాని

విశాలాంధ్ర– కోవెలకుంట్ల: కోవెలకుంట్ల ఆర్యవైశ్యల సంఘం ఆహ్వానం మేరకు ఎమ్మెల్యేకాటసాని రామిరెడ్డిరెడ్డి కోవెలకుంట్లలోని అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు శనివారం హాజరయ్యారు. సభ్యులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, గాయత్రీ దేవి అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసీపీ మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి, ఉపసర్పంచ్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆర్యవైశ్యులందరూ ఐక్యమత్యంతో వ్యాపారంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



పూజలకు హాజరైన ఎమ్మెల్యే

విశాలాంధ్ర –ఆత్మకూరు రూరల్ : మండల పరిధిలోని వెంకటాపురంలో వైసీపీ నాయకులు మూగి సందీప్ గృహంలో శనివారం సత్య నారాయణ వ్రతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. వ్రతంలో భాగంగా సత్యనారాయణస్వామికి చేపట్టిన పూజా కార్యక్రమంలో పాల్గొని మొక్కులు సమర్పించారు. అంతకు ముందు గ్రామ నాయకుల నుండి ఎమ్మెల్యేకు ఘనస్వాగతం లభించింది. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కైపలో జగనన్న సురక్ష కార్యక్రమం

విశాలాంధ్ర –బనగానపల్లె: మండల పరిధిలోని కైప గ్రామంలో గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపీడీవో శివరామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కైపా, అప్పులపురం విఠలాపురం, సంకలాపురం గ్రామానికి చెందిన 1170 మంది ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఎంపీడీవో శివ రామయ్య, డాక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ పేదలకు వైఎస్ఆర్ జగన్ అన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరము లాంటిది అన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రతాప్, నడిపిన డాక్టర్ శివ శంకర్ ,ఎం పి హెచ్ నల్లగట్ల వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజలు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

విశాలాంధ్ర– జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మారుతి శంకర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. అనంతరం జూపాడుబంగ్లాలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై మారుతి శంకర్, కానిస్టేబులు సునీల్, మధు,కర్ణ తదితరులు పాల్గొన్నారు.

యావత్ ప్రపంచాన్ని కాపాడేది పోలీస్ వ్యవస్థ ఒక్కటే
పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

విశాలాంధ్ర – నంద్యాల : పోలీస్ అమరులకు ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆర్థర్, ఎమ్మెల్సి ఇషాక్ బాషా, ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, డీఎస్ హ్యాబిబుల్లా, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్పీ బంగ్లాలో శనివారం అమర వీరుల స్తూపం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1959న లడఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో విరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారని, అమరులైన సైనికులతో పాటు విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలను అక్టోబర్ 21న స్మరించుకుని, నివాళులర్పిస్తారన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు అనునిత్యం పోరాడుతున్నారని, ప్రజలందరూ ప్రశాంతంగా ఉంటున్నారంటే పోలీసులే కారణమన్నారు. తీవ్రవాదం, అసాంఘిక శక్తుల నుంచి ప్రజలను కాపాడేందుకు కొంత మంది పోలీసులు ప్రాణాలను త్యాగం చేశారని, అమరులను స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్‌డే) నిర్వహిస్తున్నారు. విధినిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమర వీరులకు జిల్లాలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు.

సురక్ష సేవలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర– కొలిమిగుండ్ల: ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యసేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శనివారం నందిపాడు సచివాలయంలో ఎంపీడీవో ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన పరిశీలించారు. ఆరోగ్య క్యాంపును నందు వైద్యులు అందిస్తున్న సేవలను,అంగన్వాడి స్టాల్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి తో పాటు ప్రజల ఆరోగ్యనికి అధిక ప్రాధాన్యత నిస్తున్నదన్నారు. వైద్య విద్య, ఆరోగ్య వ్యవస్థల్లో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు.

రోగులకు వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. వైయస్సార్ కంటి వెలుగులో భాగంగా కొంత మందికి కంటిఅద్దాలు పంపిణీ చేశారు.

కార్య క్రమంలో వైసీపీ మండల కన్వీనర్ అంబటి గురువి రెడ్డి,మండల ఎంపీపీ నాగవేణి భర్త జయరామకృష్ణ, సర్పంచ్ గురువిరెడ్డి, తిమ్మారెడ్డి, వెంకటసుబ్బయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చెక్కుల అందజేత

విశాలాంధ్ర – నంద్యాల: నంద్యాల పట్టణం గాంధీ చౌక్ ఫ్రూట్ మార్కెట్ నందు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన 14 మంది బాధిత వ్యాపారులకు శనివారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రూ. 23.45లక్షల విలువ గల చెక్కులనుఅందజేశారు. వీరితో పాటు ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, ఎమ్మెల్యే రాంభూపాల్రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలానీ సామున్, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వెజిటబుల్ అండ్ ఫ్రూట్ మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధి కలాం, సభ్యులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డికి, మంత్రి బుగ్గన రాంజేంద్రనాథరెడ్డి, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలియజేశారు. నంద్యాల ఫ్రూట్ మార్కెట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని ప్రభుత్వానికి తెలిపి కొంత మేర నష్టపరిహారాన్ని అందించడం జరిగిందని మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి తెలిపారు. ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తంరెడ్డి, వైసీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సురక్షిత కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర –ఆత్మకూరు టౌన్ : ఆరోగ్య సురక్షిత కార్యక్రమానికి సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ పువ్వాడి దివ్య అన్నారు. శనివారం సురక్షిత కార్యక్రమంలో బీపీ, షుగర్, మోకాలు నొప్పులు హెల్త్ ఎలా ఉందని వివరించి వాళ్లకు చెప్పడం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలను వల్ల ప్రజలు సురక్షితంగా మీ ఇంటి దగ్గరికి మీ ఇంట్లోనే ఆరోగ్యం భద్రపరిచే విధంగా వైయస్సార్ సిపి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కన్వీనర్ రఫిక్, వాలంటీర్ ఆనంద్ బాబు, ఆశావర్కర్ రాణి, సుబ్బలక్ష్మి నర్సు, వీరనాగమణి, వెంకట రామసుబ్బమ్మ, లక్ష్మీదేవి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర – నంద్యాల : జిల్లా వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్రెడ్డి భూమిపూజ నిర్వహించారు. నంద్యాల పట్టణంలో శనివారం జిల్లా వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి విద్యుత్, అటవీశాఖ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్రెడ్డి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి అంజాద్ బాష, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, తొగురూరు ఆర్థర్, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు హబిబుల్లా, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఫుడ్ ప్రాసెసింగ్ చైర్మన్ కల్లూరి రామలింగారెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వీపీ మధుసూధన్రెడ్డి, డా. మిద్దె శాంతిరాముడు, మిద్దె శివరాం, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ విజయశేఖర్రెడ్డితో పాటు పలువురు కౌన్సిలర్లు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం
మిడుతూరు సెక్టార్ సూపర్ వైజర్ రేణుకాదేవి

విశాలాంధ్ర –మిడుతూరు: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మిడుతూరు సెక్టార్ సూపర్ వైజర్ రేణుకాదేవి పేర్కొన్నారు. మూడేళ్లలోపు పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని సీడీపీవో కోటేశ్వరి పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని బైరాపురం, తిమ్మాపురం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా చిరు ధాన్యాలతో వివిధ రకాల వంటలు చేసి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని తయారుచేసి తల్లులకు వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యం లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీడీపీవో కోటేశ్వరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే వైయస్సార్ సంపూర్ణ పోషణ పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేకాక రాగులు, కొర్రలు, సజ్జలు, అలసందలు, మొక్కజొన్నలు, పెసలు తదితర వాటి ప్రాముఖ్యత గురించి అధికారులకు వివరించారు. ప్రభుత్వం అందించే చిరుధాన్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనిమిక్ గర్భవతులు, బాలింతలు, పిల్లలకు పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు అందించారు.

ట్రాక్టర్ బోల్తా - ఇద్దరు మృతి

విశాలాంధ్ర–బేతంచెర్ల రూరల్ : బేతంచెర్ల నుండి బనగానపల్లెకు వెళ్లే రహదారిలోని గులాయిలలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడటంతో ఇద్దరు కార్మికులు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు మండల పరిధిలోని బలపాలపల్లెకు చెందిన హరీష్(30), స్థానిక సంజీవ్‌నగర్ కాలనీకి చెందిన దూదేకుల దస్తగిరిలు జీవనోపాధి నిమిత్తం ట్రాకర్ లోడింగ్ పనిచేస్తున్నారు. రోజు లాగే లోడింగ్ పని కోసం ట్రాక్టర్‌లో ఆరుగురు కార్మికులు పలుకురు నాపరయి క్వారీకి పోతుండగా గులాయిలలో ఎదురుగా బనగానపల్లె వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనాలు తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీలు కొడుతూ కిందకు పడటంతో హరీష్ పై ట్రాక్టర్ ఇంజన్ పడటంతో అక్కడికక్కడే మృతి చెందగా, మరో కార్మికుడు దూదేకుల దస్తగిరిపై ట్రాక్టర్ టాలి పడటంతో మృతి చెందాడు. ట్రాక్టర్ ట్రాలిలో ఉన్న సంజీవనగర్ లక్ష్మీదేవికి రెండు కాళ్లకు, చేతికి తీవ్ర గాయాలు కాగా, మరోమహిళ రామ లక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బలపాలపల్లెకు చెందిన సిద్దయ్య, హుస్సేన్ భాషలు ఇద్దరు ట్రాక్టర్ నుంచి దూకడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై శివశంకర్ నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద సంఘటన వివరాలను అడిగి తెలుసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు హరీష్ కు భార్య లక్ష్మీదేవి ముగ్గురు చిన్నారులు, దూదేకుల దస్తగిరికి భార్య వన్నూరుబీ ఇద్దరు కొడుకులు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. రెండు రోజుల్లో దసరా పండుగ ఉండటంతో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాల్సిన సమయంలో ఈ దుర్ఘటన జరగడం శోచనీయం.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

విశాలాంధ్ర–ఆత్మకూర్ టౌన్: పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివని డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసు స్టేషన్ నుంచి గౌడ్ సెంటర్ మీదుగా శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం. 1959న లడఖ్ సరిహద్దులో కావలాగా ఉన్న 10 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో విరోచితంగా పోరాడి ప్రాణాలర్పించి, అమరులైన సైనికులతో పాటు విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలను అక్టోబర్ 21న స్మరించుకుని, నివాళులర్పిస్తారన్నారు. పోలీసు విధి నిర్వహణ అత్యంత శ్రమతో కూడుకున్నది, ఇతర ఉద్యోగుల్లా కొన్ని గంటలకు పరిమితమైనది కాదని గుర్తు చేశారు. ఎండా.. వాన, పగలూ..రాత్రి అనే తేడాలేకుండా విధులు నిర్వహిస్తుంటారని తెలిపారు. పోలీసులులేని సమాజాన్ని ఊహించుకోలేమని, ప్రతి ఒక్కరూ ప్రతి అవసరానికీ సాయం కోరేది పోలీసులలేనన్నారు. కాపాడేవారు సైనిక జవానులైతే.. అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు. సంఘ విద్రోహ శక్తులతో పోరాడి విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకునేందుకు పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారని గుర్తు చేశారు.

కార్యక్రమంలో సీఐ నాగభూషణ్.ఆత్మకూరు ఎస్సై కృష్ణమూర్తి, వెలుగోడు ఎస్సై వెంకట ప్రసాద్, కొత్తపల్లి ఎస్సై హుస్సేన్ భాష, పాములపాడు ఎస్సై అశోక్ వారి సిబ్బందితో పాటు మహిళ పోలీసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో కుటుంబాలను ఆదుకున్న జగనన్న ప్రభుత్వమే

విశాలాంధ్ర– నంద్యాల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలతో మా కుటుంబాలను ఆదుకుంటున్నాడని చాబోలుకు చెందిన గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండో రోజు శనివారం చాబోలులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి లబ్ధిదారులను పలకరిస్తూ సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. ప్రధానంగా చిన్నపాటి సమస్యలున్నచో నేరుగా తనకు తెలపాలని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కూడా ముందుకు తీసుకెళ్తూ ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్కమాటను నెరవేరుస్తున్న ఏకైక ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీవో సుగుణ శ్రీ , మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, సర్పంచ్ మౌనిక, ఎంపీటీసీ చెన్నయ్య, ఉప సర్పంచ్ హుస్సేన్ భాషా, నగనందరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మదర్‌సా,తిమోతి, బాల ఉసేని, పాలమాభు, విశాల్‌రెడ్డి మధు గోపాల్ రెడ్డి వేణుగోపాల్ రెడ్డి, మహేష్, శివనారాయణ,సిబ్బంది పాల్గొన్నారు.

గజవాహనంపై దేవిదేవేరులు
కాలరాత్రి అలంకారంలో భ్రమరాంబదేవి

విశాలాంధ్ర –శ్రీశైల : ప్రముఖ శైవ క్షేత్రంగా విరజల్లుతున్న శ్రీశైల మహోత్సవంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు అయిన శనివారం నాడు భ్రమరాంబా దేవి కాలరాత్రి అలంకారంలో శివపార్వతులు గజవాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు దసరా ఉత్సవాలలో భాగంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు సాయంకాల పూజలు అయిన తర్వాత స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పలు రకాల పలు రకాల పుష్పాలతో నూతన వస్త్రాలతో అలంకరింపజేయించి అలంకరణ పూజలను అర్చక స్వాములు ఆగమ శాస్త్రానుసారంగా నిర్వహించారు అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తోడుకొని వచ్చి శ్రీశైల పురవీధుల్లో గ్రామోత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు ఈ విషేస కార్యక్రమంలో కార్యనిర్వహనదికారి డి పెద్దిరాజు దంపతులు ఆలయ అధికారులు అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు,ఆదివారం 22, అక్టోబర్ 2023

శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించి శుద్ధి చేసిన నీళ్లను వదిలే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు.శనివారం సీపీఐ పెద్దకడబూరు మండల కార్యదర్శి వీరేష్ ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు సీపీఐ, ఏఐకేఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ మంత్రాలయం,కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు మండలాల రైతులకు నెమలికల్ చెరువు ద్వారా తాగునీటి సరఫరా చేయడం జరుగుతుందని,శుద్ధ చెయ్యని నీళ్లతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు.శుద్ధ చేసిన నీళ్లను వదిలి ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నీళ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ను రద్దు చేయాలన్నారు. శాఖలో పనిచేసే వాటర్ సప్లై వర్కర్లకు పెండింగ్లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరారు. అక్కడ ఏఈగా పనిచేస్తున్న అధికారి పట్టణానికి పరిమితమయ్యారన్నారు. నేటి సమస్యపై ఎన్నిసార్లు వినిపించిన చలనం లేని అధికారులను సస్పెండ్ చేయాలని సూచించారు. గ్రామాల్లో పర్యటించకుండా కార్యాలయానికే పరిమితమయ్యారా అంటూ డీఈతో వాగ్వాదానికి దిగారు. సానుకూలంగా స్పందించిన డీఈ నవనికల్ ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఈకి సమర్పించారు.

ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ,బికేఎంయు కుమ్మరి చంద్ర, రామాంజనేయులు, వీరాంజనేయులు, తిక్కన్న, నాగరాజు,నగేష్,ఆంజనేయ, నరసింహులు,గోపాల్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాన్ని వ్యతిరేకించడానికి ఉపాధ్యాయులకు సవాలక్ష కారణాలు

ఆర్థిక బకాయిలు చెల్లించ కుంటే అధికారంలో ఉండే అర్హత కోల్పోతారు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు రావలసిన ఆర్థిక బకాయిలు 30 వేల కోట్లు చెల్లించకుంటే ఈ ప్రభుత్వం అధికారంలో ఉండే అర్హత కోల్పోయినట్లేనని, అందుకే ఈ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడానికి ఉపాధ్యాయులకు సవాలక్ష కారణాలు ఉన్నాయని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న విమర్శించారు. శనివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం పిలుపుమేరకు పెండింగ్ ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లా కేంద్రాలలో ఆక్రందన దీక్షలు పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ దగ్గర జరిగినటువంటి ఆక్రందన దీక్షా శిబిరానికి జిల్లా అధ్యక్షులు ఎస్. గోకారి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న, రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఈ. షన్మూర్తి, జిల్లా గౌరవాధ్యక్షులు సి.రమేష్, రాష్ట్ర మాజీ కార్యదర్శులు మహమ్మద్‌షఫీ, బసవరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి. నాగరాజు, బి దేవప్రసన్నరాజు, ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, మహిళా కన్వీనర్ పద్మావతి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న 2 లక్షల మంది ఉపాధ్యాయుల ఆర్థిక సెలవు బకాయిలు 8 వందల కోట్లు, భవిష్య నిధి బకాయిలు, జీవిత బీమా బకాయిలు, కరువు భత్య బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు మొత్తం కలిపి సుమారు 30వేల కోట్లు ఆర్థికబకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు అని ప్రశ్నించారు. ఆర్థిక బకాయిల చెల్లింపు పైన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణ సెప్టెంబర్ నెలాఖరులోగా చెల్లిస్తామని ఇచ్చిన హామీని కూడా నెరవేర్చలేదని ఆగ్రహించారు. ఈసందర్భంగా నల్ల బెలూన్లు గాలిలోకి ఎగరవేసి ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు.గత నాలుగు సంవత్సరాలుగా ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా మంజూరు చేయలేదని, ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని, ఉన్న ఉపాధ్యాయ పోస్టులను జీవో నెంబర్ 117 పేరుతో రద్దు చేస్తూ,3,4,5 తరగతులను విలీనం చేసి, ఈ విద్యా సంవత్సరంలో అకాడమీ కరికులం ప్రయోగాలతో కొంతకాలం బై జ్యూస్, మరికొంత కాలం సీబీఎస్ఈ, ఇటీవల టోఫెల్, ఐబి తదితర ప్రయోగాలతో పాఠశాల విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని, దీని ఫలితంగా ప్రభుత్వ లెక్కల ప్రకారమే మూడు లక్షల 80 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు వదిలివేసి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ఇచ్చినటువంటి ఎన్నికల హామీ సిపిఎస్ రద్దు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ. ఎన్నికల మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానం చేర్చి తీరా అధికారంలోకి వచ్చాక జీపిఎస్ పేరుతో ఉపాధ్యాయులను ఉద్యోగులను మోసం చేయడం సమంజసం కాదని ప్రశ్నించారు.

ఇప్పటికైనా ప్రభుత్వం ఆక్రందన దీక్షలకు దిగివచ్చి ఆర్థిక బకాయిలు చెల్లించకపోతే రాబోయే సాధారణ ఎన్నికలలో భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

రంగస్థల కళాకారిణులకు చీరల పంపిణీ

విశాలాంధ్ర-కర్నూలు : కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయదశమి సందర్భంగా కర్నూలు జిల్లా సుప్రసిద్ధ రంగస్థల మహిళా కళాకారినులకు విచీరల పంపిణీ కార్యక్రమం శనివారం నగరం నందలి పింగళి సూరన్న తెలుగు తోట నందు టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జి అంకయ్య, చీరల పంపిణీ ప్రదాత బైలుప్పల షఫీయుల్లా, తెలుగుభాష ఉద్యమ నాయకులు జెఎస్ఆర్‌కె శర్మ పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొని రంగస్థల మహిళా కళాకారులు అరుణకుమారి, రాధిక, నిర్మలా, ప్రియ దర్శిని, శోభారాణి, అరుణ,లక్ష్మీ ప్రసన్న, మంజుల జ్యోతి ,శారదా ,రేణుక, రాజ్యలక్ష్మి, పద్మావతి, కమలమ్మ, చంద్రకళ, మౌనిక, ప్రముఖ రంగస్థల మహిళ కళాకారులకు దసరా కానుక చీరల పంపిణీ అంద జేశారు. కళామతల్లి సేవలో రంగస్థలానికి విశిష్ట సేవలందిస్తున్న పెద్దలు పత్తి ఓబులయ్య, హనుమంతరావు చౌదరి ఘనంగా సన్మానించారు.

కర్నూలు జిల్లా మహిళా కళాకారులు రాష్ట్ర స్థాయి జాతీయస్థాయి గుర్తింపు పొంది రజినీ బాయి ఆదర్శంగా పోటీపడి మహానటిగా గుర్తింపు పొందాలని కోరారు. ఈవస్త్రదాన కార్యక్రమంలో కర్నూలు కళాకారులు గజల్ గాయకులు మహమ్మద్ మియా పి.హనుమంతరావు చౌదరి, డాక్టర్ ఎస్‌జిఎన్ సుభాన్, మహిళా కళాకారులు కర్నూలు జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తేవాలి కోరారు.

సాగునీటి కోసం రైతులు అగచాట్లు

విశాలాంధ్ర- పెద్దకడబూరు : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని రైతన్నలు తమ పొలాల్లోని మిరప పంటను కాపాడుకునేందుకు ఎన్నో కష్టాలు పడుతున్నారు. వరుణ దేవుడు ఈ ఏడాది ముఖం చాటేయడంతో పంటలు వాడుముఖం వేశాయి. ముఖ్యంగా పూత దశలో ఉన్న మిరప పంటను కాపాడుకునేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా సాగునీరుని తోలుతున్నారు. ఒక ట్యాంకర్ నీరు రెండు మిరప బాదీలకు మాత్రమే సరిపోతాయని రైతులు శనివారం విలేకరుల ముందు వాపోయారు. ఒక తడి నీళ్ళు పెట్టాలంటే రూ.20 వేలు వరకు ఖర్చవుతాయన్నారు. ఇప్పటికే ఎకరానికి వేలాది రూపాయలు ఖర్చు చెయ్యడం జరిగిందని, వర్షాలు కురవకపోతే పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయి తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న రోగిని పరామర్శించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: నగరంలోని సర్వజన వైద్యశాల సూపర్ స్పెషాలిటీ బ్లాక్ న్యూరాలజీ వార్డులో చికిత్స పొందుతున్న నరసింహులు (41) ను జిల్లా కలెక్టర్ డా.జి.సృజన పరామర్శించారు. శనివారం అనంతపురం జిల్లా బెడుగుప్ప మండలం ఆవులెన్న గ్రామానికి చెందిన రైతు, నరసింహులు ఈ ఏడాది మే 28న కళ్యాణదుర్గం మండలంలోని చాపిరి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై జ్ఞాపకశక్తి కోల్పోయారు. వీరి కుటుంబం ఆర్థిక సహాయం కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఎమ్మిగనూరు పర్యటనలో కలిసి విన్నవించడం జరిగింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం కలెక్టర్ నరసింహులును పరామర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు సర్వజన వైద్యశాలలో 3 వారాలుగా నరసింహులు చికిత్సపొందుతున్నారని తెలిపారు. అవసరమైన చికిత్సను డాక్టర్లు అందిస్తున్నారని పేర్కొన్నారు. వేరెక్కడైనా అత్యున్నతమైన వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పేషెంట్ కుటుంబ సభ్యులను వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్స్ సంబంధిత అధికారులకు అందజేయాల్సిందిగా చెప్పారు. అవసరమైతే వైద్యుల సలహాలు సూచనలతో కూడిన రిపోర్టు ముఖ్యమంత్రికి అందజేస్తామని తెలిపారు. పేషెంట్‌కు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఇప్పటివరకు రూ.6.50 లక్షల ఆర్థికసాయం అందినట్టుగా తెలియజేశారు.

స్వచ్ఛంద సంస్థ..సేవలకు సత్కారం

విశాలాంధ్ర - కర్నూలు వైద్యం: సమాజంలోని ప్రతి రంగములో నిత్యం అనేకమంది నిస్వార్థమైన సేవలు అందిస్తున్నారు. ఆలాంటి వారిని గుర్తించి రాజ్ కుమార్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించనున్నట్లు ఆసంస్థ వ్యవస్థాపకురాలు బి. రత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు.రాజకుమార్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు.మాజీ రాష్ట్రపతి ఏరో స్పెస్ సైంటిస్ట్ డాక్టర్ ఏపీజే.అబ్దుల్ కలామ్ 92 వ జయంతినీ పురస్కరించుకొని నవంబర్ 20న కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.నాటక రంగం, రచయితలు, డైరెక్టర్స్, డాక్టర్స్,విద్య, వైద్య, న్యాయవాద,సాంస్కృతిక, సంగీత, నృత్య, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ప్రభుత్వ మరియూ ప్రవేట్ రంగ సంస్థల వారిని ఆహ్వానిస్తున్నామని బి.రత్నకుమారి తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మీ ఫోటోతో పాటు పూర్తి వివరాలతో 7569425354 నెంబర్ కి వాట్సప్ చేసి 2023 నవంబర్ 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని రాజకుమార్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు బి.రత్నకుమారి తెలిపారు.

దసరా ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చాగలమర్రి: పట్టణంలోని ఆలయాలలో దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే గంగుల భిజేంద్రారెడ్డి శనివారం పాల్గొన్నారు. ముందుగా పాత బస్టాండులోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామీ ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అధ్యక్షుడు కొండయ్య ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి వాసవిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లక్ష్మణబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి సన్మానించారు. పండుగలతో ప్రజలలో ఐక్యత ఏర్పడుతుందని ఎమ్మెల్యే తెలియజేసారు.కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, జిల్లా జేసీఎస్ అధ్యక్షుడు బాబుబాల్,మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి,వైసీపీ నాయకులు జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, వెంకటరమణ, ఆర్ఎస్ రమణ, పెద్దరాముడు, స్వామిరెడ్డి, నాగేంద్ర, బచ్చు సుబ్రమణ్యం,ఐడియా బాబు, ఆర్యవైశ్య సంఘం నాయకులు క్రిష్ణం శివప్రసాద్, మల్లికార్జున, నవత ప్రసాద్, నరసింహ, లక్ష్మీనారాయణ, సునీల్, రవి, వినోద్‌లు పాల్గొన్నారు.

వలసలు పోకుండా అందరికీ ఉపాధి కల్పిస్తాం

విశాలాంధ్ర- హెరాళగుండ : హెలాగుండ ఎండిఓ కార్యాలయ ఆవరణంలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది .ఈ సందర్భంగా డ్వామా ఫీడి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు ఉపాధి కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు .ఉపాధి హామీ సిబ్బంది ప్రజలు వలస వెళ్లకుండా చూడాలని కచ్చితంగా కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని ఆదేశించారు. ప్రజలు దూరప్రాంతాలకు వలస వెళ్లి నష్టపోకుండా ఉన్న ప్రాంతాల్లో ఉపాధి పనుల్లో పాల్గొని ఉపాధి పొంది కుటుంబాలతో సుఖసంతోషాలతో ఉండాలని విజ్ఞప్తి చేశారు . రికవరీ కట్టవలసిన వారు వెంటనే రికవరీ కట్టాలని లేకపోతే శాఖాపూర్ణమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బందికి ఏమి అడిగినా ఆధారాలు రుజువుతో చూపించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. మండలంలోని 17 పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన అభివృద్ధి పనులపై రికార్డులను పరిశీలించారు. మండలంలో 5,844 రికవరీ కోసం చర్యలు తీసుకున్నామని అలాగే సిబ్బంది చేసిన తప్పులకు రూ.15 వేల జరిమానా విధించడం జరిగిందన్నారు. ప్రజావేదిక కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా విజిలెన్స్ అధికారులు లోకేశ్వర్, చంద్రశేఖర్, ఏపీడీ పకీరప్ప, సోషల్ ఆడిట్ అధికారి లోకేశ్వర్‌రెడ్డి, ఏపీవోలు భక్తవత్సలం, శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ మంజునాథ్, ఉపాధి హామీ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - హెరాళగుండ : మండల పరిధిలోని కొగిలతోటలో శనివారం నూతన విద్యుత్ సబ్స్టేషన్ నిర్మాణానికి సర్పంచ్ గురుపాదం జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు కురువ బుజ్జమ్మ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. స్థల దాత బోయ గుడ్డయ్య ఇచ్చిన భూమిలో పూజారి రుద్రమునిస్వామి వేద మంత్రోచ్చారణలతో భూమి పూజ నిర్వహించారు. వైసీపీ సీనియర్ నాయకులు కురువ శేషప్ప, నాగప్ప, వెంకటేశులు మాట్లాడుతూ కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, దేవరగట్టు మాలమల్లేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలూరు వైసీపీ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, సహాయ సహకారంతో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరయింది. రైతులు ప్రజలు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లడంతో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేసి ఆదుకున్నారని కొనియాడారు. ఆలూరు విద్యుత్ ఏ డి ఏ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కోగిలతోటలో 33/11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయింది. మూడు నెలల లోపు సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈఈ సుధాకర్ కుమార్ ఆపరేషన్ ఈఈ రాజేష్, ఏడీఏ నాగేంద్ర ప్రసాద్, ఏఈలు ఓబులమ్మ, కృష్ణమూర్తి, సర్పంచ్ గురుపాదమ్మ, వైసీపీ మండల కన్వీనర్ షఫీ ఉల్లా, సింగల్ విండో చైర్మన్ మల్లికార్జున, ఎంపీటీసీ మల్లికార్జున, నాయకులు సత్యనారాయణరెడ్డి, ఈసా, వెంకటేష్, శేషప్ప, నాగప్ప, గోవిందప్ప, బీరప్ప, చంద్ర, ప్రజలు, సిబ్బంది జంపన్న,నాగేష్‌లు పాల్గొన్నారు.

జడ్‌పీటీసీ అకాల మృతి

విశాలాంధ్ర - కర్నూలు లీగల్ : కల్లూరు మండల జడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి కొన్నిరోజులనుంచి అనారోగ్యంతో బాధపడుతూహైదరాబాదులో ప్రైవేట్ హాస్పిటల్లో ట్రీట్మెంట్ తీసుకుంటూ శుక్రవారం రాత్రి 9:30 గంటలకు మృతి చెందారు. హైదరాబాద్ నుంచి తన సొంత గ్రామం పెద్దటికూరు గ్రామానికి జడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి మృతి దేహాన్ని తీసుకొని వచ్చారు. మండలంలోని నాయకులు,కార్యకర్తలు చేరుకొని మృతదేహానిక పూలమాలవేసి నివాళులర్పించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డితో పాటు తన కుమారుడు నరసింహారెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు. తన కుటుంబాన్ని ఓదార్చారు ఇలాంటి నాయకుడు కోల్పోవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. అందరికీ ఆప్యాయంగా ఉండి శనివారం ప్రభాకర్ రెడ్డి లేకపోవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు.

నాయకులు పెద్దటేకూరు హనుమంత రెడ్డి, మద్దిలేటి, మునిస్వామి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనుచరులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర- పత్తికొండ: రైతుల భూములను కబ్జా చేస్తున్న ఎమ్మెల్యే అనుచరులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ప్రతినిధి బృందం బాధిత రైతులతో కలిసి ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణాపురం గ్రామంలో 40 ఏళ్లుగా సాగు చేసుకుంటూ అనుభవంలో ఉన్న రైతుల భూములను ఎమ్మెల్యే అనుచరులు కోన రఘుపతిరెడ్డి, చెరుకులపాడు గ్రామానికి చెందిన రెవెన్యూ అధికారులను ప్రలోభాలకు గురిచేసి ఆన్లైన్ చేసుకున్నారని, సర్వేనెంబర్682, 683,686,688,తదితర సర్వే నెంబర్లలో బోయ మధు, బోయ సుంకులమ్మ పేర్ల మీద ఉన్న భూములను రైతులకు తెలియకుండా రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని ఆన్లైన్ లో నమోదు చేసుకోవడం అన్యాయం అని పేర్కొన్నారు. రైతుల పొలాలను వారికి కాకుండా ఇతరులకు కేటాయించడం పట్ల స్థానిక తహశీల్దార్, వీఆర్వోలకు పలుమార్లు ఫిర్యాదు చేసిన స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని, ఈ అంశంపై ఈనెల 16న స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా పత్తికొండ ఆర్డీఓ సమస్య పై స్పందించి బాధిత రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈర్యక్రమంలో చేతి వృత్తి దారుల దారుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న, సీపీఐ కృష్ణగిరి మండల సహాయ కార్యదర్శి బొంతిరాళ్ల గ్రామ సర్పంచ్ రవి మోహన్ పరమేశ్వర్ రెడ్డి కత్తి సుంకన్న మద్దిలేటి మధు గోపాల్ శేఖర్, శ్యామ రావు, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

బన్నీ ఉత్సవ భక్తులకు అన్ని వసతులు కల్పించాలి

విశాలాంధ్ర- హెరాలగుండ : మండలంలోని నేరనికి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి బన్నీ ఉత్సవం 24న జరగనున్న సందర్భంగా శనివారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు గిరి పైకి వెళ్ళి మాల మల్లేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ భక్తులకు త్రాగునీరు వైద్య విద్యుత్ అంబులెన్స్ సదుపాయంతో పాటు బారికేట్స్ సదుపాయం కల్పించడానికి అధికారులకు ఆదేశించారు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు దేవరగట్టులో భక్తుల కోసం ఏర్పాటు చేసిన టెంట్లను సీసీ కెమెరాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు ఇవన్నీ ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసు కున్నారు సబ్ కలెక్టర్ వెంట పత్తికొండ ఆర్డిఓ దేవదాసు తహశీల్దారు హుస్సేన్‌సాబ్,సీఐ వెంకటేశ్వర్లు ఎస్సై శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ దినోజ్ కుమార్, విఆర్ఓ నాగరాజ్, దామోదర్, కార్యదర్శి రాజశేఖర్ గౌడ్‌లు పాల్గొన్నారు. బన్నీ పోలీసు అవగాహన సదస్సును నిర్వహించాలని, ఎక్కువ ప్రచారం చేయాలని సబ్‌కలెక్టర్ అధికారులను కోరారు. బన్నీ ఉత్సవంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రాగమయూరి లక్కీ డ్రాకు విశేష స్పందన

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: రాగమయూరి బిల్డర్స్ నేతృత్వంలో నిర్వహించిన లక్కీ డ్రాకు విశేష స్పందన లభించింది. శనివారం కర్నూలులో నిర్వహించిన లక్కీ డ్రాలో కర్నూలు, చుట్టుపక్కల ప్రాంతాల నుండి దాదాపు 1200 రాగమయూరి కుటుంబ సభ్యులైన కస్టమర్లు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టిజీ. వెంకటేష్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రాగ మయూరి బిల్డర్స్‌గ్రూప్ చైర్మన్ కె.జె.రెడ్డి, ప్రతాపరెడ్డిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా కె.జె. రెడ్డి మాట్లాడుతూ దసరా స్కీమ్ 2022 కరోనా పాండమిక్ తర్వాత జరిపిన మొదటి డ్రా ఫంక్షనని, ఈ డ్రా లో 2022 దసరా స్కీమ్లో బుక్ చేసుకొని పూర్తి క్రయధనాన్ని చెల్లించిన మొదటి 200 కస్టమర్స్ కొరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ డ్రా ద్వారా 30 లక్షల విలువైన 5 బహుమతులను విజేతలకు అందజేశామని, మొదటి బహుమతి కియా షెల్టర్ కార్, రెండవ బహుమతి ఉందాయ్ 120 కార్, మూడవ బహుమతి దస్తన్ గో కార్, నాల్గవ బహుమతి మారుతి ఆల్టో కార్, ఐదవ బహుమతి హీరో ఫ్యాషన్ బైక్‌లను అంత చేస్తున్నట్టు ప్రకటించారు.మా ప్రస్తుత ప్రాజెక్ట్ మయూర అంకురలో కేజేఆర్ సిటీ గేట్‌వేల్లో ఆస్తిని కొని ఆస్తి తో పాటు ఉగాది డ్రా ఫంక్షన్లో బహుమతులు గెలుచుకొని విజేతలుగా నిలవాలని కోరారు. బహుమతుల డిస్ట్రిబ్యూషన్ అనంతరం కస్టమర్స్ ఆహ్లాదం కోసం డ్యాన్స్, మిమిక్రి, ఫ్యాషన్ షోలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డ్రా ఫంక్షన్ లో పాల్గొన్న ప్రతిఒక్కరికి రాగమయూరి బిల్డర్స్ తరుపున కె.జె. రెడ్డి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

మాదాసి కురువ గర్జన జయప్రదం చేయండి

విశాలాంధ్ర- హెరాలగుండ : హెరాలగుండలో మాదాసి కురువ సంఘం కార్యాలయంలో శనివారం మాదాసి కురువ సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా మాదాసి కురువ నాయకులు మాట్లాడుతూ బీరప్ప స్వామి దేవాలయంలో పనిచేస్తున్న పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. మాదాసి కురువ కుల ధ్రువీకరణ పత్రం ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. గురువయ్యలకు కళాకారులుగా గుర్తించి పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. గొర్రెల కాపలదారులకు పంట పొలాల్లో ఉన్నవారికి బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఆలూరు నియోజకవర్గంలోని శ్రీభక్త కనకదాసు విగ్రహం ఏర్పాటు చేయడానికి కృషి చేయడానికి ఏర్పాటు చేయాలని కోరారు.డిసెంబర్ 10న కురువ మహాగర్జన ఆలూరు నియోజకవర్గం పరిధిలో నిర్వహిస్తామని మన మండలం నుండి భారీ ఎత్తున పాల్గొనాలని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు కురవ సంఘం నాయకులు ఏలార్థి పెద్ద దర్గన్న,డాక్టర్ చంద్రశేకర్,డాక్టర్ రమంజిని,ముద్దటమగి గర్జప్పా,చగప్ప,గోపాల్, ఆలూరు తాలూకా మాదాసి కురువ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లయ్య, ఆలూరు తాలూకా రాయన్న యువజన సంఘం ప్రధాన కార్యదర్శి మంజు,నారెగలప్ప,ఏళార్తి లక్మాన్న,రము,నల్లారెడ్డి, మండల కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప

విశాలాంధ్ర -ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు పట్టణ ఏఐటీయూసీ సమితి సభ్యుల సమావేశం సీపీఐ కార్యాలయం నందు ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు యు.విరేష్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునేప్ప సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వంపనగౌడు, సీపీఐ పట్టణ కార్యదర్శి జి..రంగన్న, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మ గురుడు హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ కార్మిక సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని వారు విమర్శించారు అలాగే ఈనెల 31న ఏఐటీయూసీ 104,వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కార్మిక అడ్డాలలో జెండాలకు రంగులు వేసి ఎగిరివేసి ప్రదర్శనాలు, సభలు నిర్వహించి, ఘనంగా చేయాలని వారు పిలుపునిచ్చారు మరియు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో వైఎస్సార్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 27, 28 తేదీలలో చలో రాజ్ భవన్ మహాధర్నా కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో వచ్చి విజయాంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జిల్లాలలో ఉన్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు నెలలు తరబడి పనిచేస్తున్న రెండు, మూడు నెలల జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని తక్షణమే కార్మికులకు దసరా పండగ సందర్భంగా పెండింగ్ జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.అనంతరం స్థానిక సోమేశ్వర టాకీస్ సర్కిల్ ఆటో స్టాండ్ కార్మికులను నూతన కమిటీ ఎన్నుకున్నారు.సమావేశంలో ఏఐటీయూసీ తాలూకా సహాయ కార్యదర్శి విజయేంద్ర, నరసింహులు, తాలూకా ఉపాధ్యక్షులు వీరేష్, వీరాంజి గౌడ్,శివ, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వర టాకీస్ (సర్కిల్) ఆటో స్టాండ్ ఏఐటీయూసీ నూతన కమిటీ

అధ్యక్షులు జి.లక్ష్మీనారాయణ,కార్యదర్శి విజయ్‌కుమార్,ఉపాధ్యక్షులు వీరేష్, ఆంజనేయులు, సహాయ కార్యదర్శులు వీరేష్,క్రాంతి కుమార్, కోశాధికారి రమేష్, సభ్యులుగా నవీన్, లోకేష్,గోపీ, రామలింగడు,బద్రి, నాగరాజు,ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో దూదేకులకు ప్రాతినిధ్యం కల్పించాలి

విశాలాంధ్ర- పెద్దకడబూరు : చట్ట సభలలో దూదేకులకు ప్రాతినిధ్యం కల్పించాలని దూదేకుల ముస్లిం సంఘం జిల్లా అధ్యక్షులు మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. శనివారం పెద్దకడబూరులోని రేయిన్ బో ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ఆవరణలో దూదేకుల ముస్లింల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం అన్నిరాజకీయ పార్టీలు దూదేకులకు 6 అసెంబ్లీ స్థానాలు, 2 పార్లమెంటు స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దూదేకుల ముస్లిం జనాభా 7 శాతం ఉన్నారని, అయితే తమను రాజకీయ పార్టీలు ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే వాడుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీ పదవులలో వర్గీకరణ, దామాషా ప్రకారం దూదేకుల పదవులు, బడ్జెట్ తప్పనిసరిగా ఇవ్వాలని కోరారు. ఏ రాజకీయ పార్టీ అయితే నూర్ బాషా లేదా దూదేకుల ముస్లిం కులస్థులకు చట్ట సభల్లో అవకాశం కల్పిస్తుందో ఆ పార్టీ తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. హక్కుల సాధన దూదేకుల ముస్లింలు ఐక్యంగా పోరాడాలని, అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. దూదేకుల ముస్లిం హక్కుల సాధనకు ఈ నెల 29న గుంటూరులో జరిగే దూదేకుల ముస్లింల సింహగర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు సాయిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శేక్ షావలి, జిల్లా కార్యదర్శి ఇమామ్ కాశీం, జిల్లా ఉపాధ్యక్షులు మాబుసాహెబ్, నాయకులు పక్కిరప్ప, వలి, దస్తగిరి, పెద్ద అలిసాబ్ తదితరులు పాల్గొన్నారు.